నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, ఆదివారం 18 ఆగస్టు 2024 VIKARABAD

# టీచర్లకు జీతాలు రాలే..



రంగారెడ్డి జిల్లాలో బదిలీలు, ప్రమోషన్లు పొందిన 1500లకుపైగా ఉపాధ్యాయులది ఇదే పరిస్థితి

సకాలంలో బిల్లులు పంపినప్పటికీ విడుదల కాని వేతనాలు

ఆందోళన చెందుతున్న ఉపాధ్యాయులు

రంగారెడ్డి, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ): జిల్లాలో పలువురు ప్రభుత్వ టీచర్లకు జూలై నెలకు సంబంధించిన జీతాలు ఇంకా రాలేదు. ఆగస్టు 18వ తేదీ వచ్చినప్పటికీ జీతాలు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జిల్లాలో బదిలీలు, ప్రమోషన్లపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఈ పరిస్థితి ఏర్పడింది. జూన్ నెలాఖరులో రంగారెడ్డి జిల్లాలో ఆలస్యంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టారు. దీంతో కొంత మంది ఉపాధ్యాయులు జూలై 1 వరకు పాత పాఠశాలలో కొనసాగి 2వ తేదీన కొత్త పాఠశాలలకు వెళ్లారు. మరికొందరు జూలై 4న పాత పాఠశాలల్లోనే విధులు నిర్వర్తిస్తే 5వ తేదీన బదిలీలు, పదోన్నతులపై వేరే పాఠశాలలకు వెళ్లారు. అయితే గతంలో పనిచేసిన పాఠశాలల్లో విధులు నిర్వర్తించిన ఒక రోజు, నాలుగు రోజులకు సంబంధించిన వేతనాలు మాత్రమే ఆగస్టు 1న టీచర్ల ఖాతాల్లో జమ అయ్యాయి. కొత్త పాఠశాలల్లో విధులు నిర్వర్తించిన మిగతా రోజులకు సంబంధించిన జీతాలు విడుదల కాలేదు. దీంతో జిల్లాలో బదిలీ, పదోన్నతులపై వెళ్లిన సుమారు 1500 మంది ఉపాధ్యాయులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత పాఠశాలల్లో పాఠశాల హెచ్ఎంలు, ప్రైమరీ పాఠశాలల్లో ఎంఈవోలు సకాలంలో బిల్లులు చేసి ఎస్టీవో కార్యాలయంలో సబ్మిట్ చేసినప్పటికీ ప్రభుత్వం జీతాలను విడుదల చేయకపోవడంపై ఉపాధ్యాయవర్గాలు మండిపడుతున్నారు. ఒకటో తేదీన్నే జీతాలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈ నెల జీతాలను సకాలంలో ఇవ్వడంలో విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ నెల జీతాన్ని వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ విషయమై డీఈవో సుశీందర్‌రావును వివరణ కోరగా.. వేతనాల విషయం తన దృష్టికి రాలేదన్నారు. డీటీవోతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

### ప్రభుత్వ వైఫల్యమే..



జిల్లాలోని పలువురు టీచర్లకు ఈ నెల జీతాలు ఇవ్వకపోవడం ప్రభుత్వ వైఫల్యమే. చాలా మంది టీచర్లకు వేరే ఆదాయ మార్గం లేదు. టీచర్లకు ఏ నెలకు ఆ నెల జీతం ఒకటో తేదీన వస్తేనే జీవనం చక్రం ముందుకు సాగుతుంది. నెలవారీ బడ్జెట్ ప్రకారం కుటుంబాన్ని నెట్టుకురావాలంటే టైమ్‌కు జీతాలు అందాలి. ఈ నెల జీతాలు రాకపోవడంతో బ్యాంకులకు ఈఎంఐలు కట్టలేక డిఫాల్టర్లుగా మారాల్సి వస్తున్నది. తీసుకున్న రుణాలకు పెనాల్టీ కట్టాల్సి రావడంతోపాటు సిబిల్ స్కోర్ కూడా పడిపోతుంది.

**-సత్తారి రాజిరెడ్డి, టీఎస్‌పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి**

### హుస్సేన్‌సాగర్‌కు భారీ వరద..

## దిగువకు నీటి విడుదల



సిటీబ్యూరో, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ) : నగరంలో రెండు రోజుల పాటు కురిసిన వర్షాలకు హుస్సేన్‌సాగర్‌లోకి భారీగా వరద నీరు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 513.41 అడుగులు కాగా, శనివారం ఉదయం వరకు 513.53 వరకు చేరింది. దీంతో నీటిని దిగువకు వదిలారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 2075 క్యూసెక్కులు ఉండగా, ఔట్‌ఫ్లో 1538 క్యూసెక్కుల నీటిని దిగవకు వదులుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# మాఫీకాక మనో వేదన



కొడంగల్ వ్యవసాయశాఖ కార్యాలయంలో అధికారులను సంప్రదించిన రైతు..

వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న బాధిత రైతులు

రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతోనే రుణమాఫీకి దూరమయ్యామంటున్న అన్నదాతలు

కొడంగల్, ఆగస్టు 17: రుణమాఫీ పొందని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన మూడో దఫా రూ.2లక్షల రైతు రుణమాఫీ రైతులకు నిరాశను మిగిలించింది. అర్హత ఉన్నప్పటికీ ఆయా కారణాల వల్ల రుణమాఫీ పొందలేదని అధికారులు పేర్కొనడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయారు. మండలంలోని హస్నాబాద్ వ్యవసాయ క్లస్టర్ రైతువేదికలో మొత్తంగా దాదాపు 2200 మంది రైతులు ఉన్నారు. వీరిలో మొదటి, రెండో దఫాలో రూ.లక్ష, రూ.1,50 లక్షలు మొత్తంగా 700 మంది వరకు రైతులు రుణమాఫీని అందుకున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. మూడో దఫా కింద ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో రైతులు బ్యాంకుల ముందు పడిగాపులు కాస్తూ.. రుణమాఫీ వివరాలను తెలుసుకొంటున్నారు. అదేవిధంగా రుణమాఫీ రాని రైతులు వ్యవసాయ కార్యాలయం ఎదుట నిరీక్షిస్తూ రుణమాఫీ ఎందుకు రాలేదని అధికారులను సంప్రదిస్తున్నారు. దీంతో వ్యవసాయ కార్యాలయాలకు రైతుల తాకిడి పెరిగింది. రుణమాఫీ అయ్యిందా.. లేదా.. అని తెలిపేందుకు అటు బ్యాంకు అధికారులు, ఇటు వ్యవసాయాధికారులు ఆసక్తిని చూపడం లేదని, కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయాధికారులు రైతులను చీదరించుకుంటున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. దేవుడు వరమిచ్చినా, పూజారి అడ్డుకొన్నట్లుగా రుణమాఫీ స్టేటస్‌ను తెలుసుకోవడం గగనంగా మారిందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖలో ఏఈవోల బదిలీలు కావడంతో సమాచారం అందుకోవడం ఇబ్బందిగా మారిందని, బదిలీ అయినవారు తమకు తెలియదని సమాధానం, కొత్తవారు రాకపోవడంతో ఎవరిని సంప్రదించాలో అర్థం కావడం లేదని రైతులు వాపోతున్నారు. నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల పరిధిలో మొత్తంగా 52,305 మంది రైతులు ఉన్నారు. వీరిలో మొదటి దఫాలో 9604 మంది రైతులు రూ.లక్ష రుణమాఫీని అందుకోగా.. రెండో దఫాలో రూ.1.50లక్షల రుణమాఫీతో 6057 మంది లబ్ధి పొందారు. ఇక మిగతా 36,644 మంది రైతుల్లో రూ.2లక్షలు తీసుకొన్న వారు కొంతమందే ఉన్నప్పటికీ.. అందులోనూ సగం మంది కూడా రుణమాఫీ పొందలేక పోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డు, ఆధార్‌కార్డు వంటి తప్పులను చూపించి రుణాలు మాఫీ చేయలేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు.

### రేషన్‌కార్డులో పేరు లేదని..



రేషన్ కార్డులో పేరు లేదని రుణమాఫీని పొందలేదు. హస్నాబాద్ గ్రామ పరిధిలో 4 ఎకరాల 8 గంటల భూమి ఉంది. గతంలో బ్యాంకులో అప్పు తీసుకొని మళ్లీ సరైన సమయంలో రుణాన్ని కట్టి రెన్యువల్ చేయించా. ప్రస్తుతం రూ.1.60లక్షల అప్పు ఉన్నది. ప్రభుత్వం మూడో దఫాల్లో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పగా.. బ్యాంకుకు వెళ్లి చూస్తే లిస్టులో నా పేరు లేదు. రూ.2లక్షల లోపు అప్పు ఉన్నప్పటికీ మాఫీ కాకపోవడం చాలా బాధగా ఉంది. కొంత మందికి మాఫీ అయి.. అర్హత ఉన్నప్పటికీ నా రుణ మాఫీ కాలేదు. దీనిపై అధికారులను సంప్రదిస్తే రేషన్ కార్డులో పేరు లేనందున మాఫీ కాలేదని తెలుపుతున్నారు. అప్పును అప్పుగానే చూడాలి కానీ రేషన్‌కార్డు, బంధుత్వం అని చూసి మాఫీ చేస్తే మాలాంటి ఎంతో మంది రైతులు ఈ విధంగా నష్టపోవడం జరుగుతుంది.

**-బోయిని కిష్టమ్మ, హస్నాబాద్. కొడంగల్**





మణికొండలో కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

సలహా ఇచ్చినా తప్పేనా..?

కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ నేతల మండిపాటు

మణికొండ, ఆగస్టు 17: హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన కేటీఆర్.. నిద్రపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అమూల్యమైన సలహాగా బస్సుల్లో సీట్లు పెంపుపై పొరపాటున మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై అన్న చిన్నపాటి మాటకు మహిళా కమిషన్ స్పందించి నోటీసులు ఇవ్వడం హేయమైన చర్య అని మణికొండ బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మానవతావాదిగా మహిళలకు క్షమాపణలు చెప్పినా.. రాజకీయ రంగు పూసి.. కాంగ్రెస్ నేతలు అబద్ధాలతో పూటగడుపుకొంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సలహాలు ఇచ్చినా తప్పే అయిపోతున్నదన్నారు. కాగా, మణికొండ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మర్రిచెట్టు వద్ద కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, విజయలక్ష్మి, లతాగౌడ్, అందె లక్ష్మణ్‌రావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

*వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్*

వికారాబాద్, ఆగస్టు 17: గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో గురుకుల పాఠశాలల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల సంక్షేమ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సకల సౌకర్యాలు కల్పించాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. అదేవిధంగా విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అనుగుణంగా ఫ్యాన్స్, లైట్లు అమర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మంజూరు చేసిన నిధులతో విద్యుత్తు , ప్లంబర్ పనులు చేపట్టడమే కాకుండా టాయిలెట్స్, నల్లాలు, గోడల పగుళ్లు, ఫ్లోరింగ్, పై కప్పు నీరు లీకేజీ లాంటి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా మంచాల ఏర్పాటు, గదుల్లోకి స్వచ్ఛమైన గాలి వచ్చేలా కిటికీలు, వెంటిలేటర్లకు జాలీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వం అందించిన నిధులు వృథా కాకుండా అవసరమైన మైనర్ పనులను చేపట్టాలన్నారు. పాఠశాలల భవనాల పై నీరు నిల్వ ఉండకుండా, పైకప్పుల మరమ్మతులు పనులు చేపట్టాలని తెలిపారు. పనులు చేపట్టకముందు, పనులు పూర్తయిన తర్వాత తీసిన ఫొటోలను సమర్పించాలని అధికారులకు సూచించారు. జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియామకం చేసి పనులు పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. మేజర్ పనులు ఏవైనా ఉంటే ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం, గిరిజన అభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, గురుకులాల ప్రిన్సిపాళ్లు, అధికారులు పాల్గొన్నారు.

# బల్దియా టౌన్‌ప్లానింగ్‌లో బదిలీలు!

### సీపీ, ఏసీపీలకు స్థానచలనం

సిటీబ్యూరో, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో సిటీ ప్లానర్స్, ఏసీపీలకు స్థానచలనం కల్పిస్తూ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు. శేరిలింగంపల్లి జోన్ సిటీ ప్లానర్‌గా శ్యామ్, ఎల్బీనగర్ జోన్ సిటీ ప్లానర్‌గా శ్రీనివాస్ యాదవ్, చార్మినార్ జోన్ సీపీగా మాజిద్, కూకట్‌పల్లి సిటీ ప్లానర్‌గా గణపతి, ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలోని చార్మినార్ సెక్టార్‌కు సిటీ ప్లానర్‌గా ఉమాదేవి, అడిషనల్ సీసీపీ వెంకన్నకు ప్రధాన కార్యాలయంలోని ఖైరతాబాద్ జోనల్ బాధ్యతలు అప్పగించారు. వీరితో పాటు పలువురు ఏసీపీల బదిలీలూ జరిగాయి. చందానగర్‌కు నాగిరెడ్డి, జూబ్లీహిల్స్‌కు శ్రీనివాస్, మల్కాజిగిరికి శ్రీనివాసరావు, ఎల్బీనగర్‌కు ప్రతాప్, మలక్‌పేటకు గజానందం, చాంద్రాయణగుట్టకు భానుచందర్, ఫలక్‌నుమాకు మంజులాసింగ్, చార్మినార్‌కు రాందాస్, ముషీరాబాద్‌కు దేవేందర్, అంబర్‌పేటకు సుమిత్ర తదితర ఏసీపీలకు ఆయా స్థానాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. అలాగే పలు చోట్ల టీపీఎస్‌లనూ మారుస్తూ.. నిర్ణయం తీసుకున్నారు.అలాగే 27 మంది అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లకు కూడా స్థానచలనం కల్పిస్తూ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు డిప్యూటీ ఈఈలను పలు సర్కిళ్లకు మార్చారు.





# మన మెట్రోకు మొండిచెయ్యే

- బెంగళూరు మెట్రో ఫేజ్- 3కూ భారీగా కేటాయింపులు
- పదేండ్లుగా ఇక్కడి మెట్రో ప్రాజెక్టులపై శీతకన్ను
- అభివృద్ధికి సహకరించకపోవడంపై నగరవాసుల ఆగ్రహం

## బడేభాయ్ చిన్నచూపు • థానె, పుణె మెట్రోలకు కేంద్రం నిధులు

*దేశంలో ప్రధాన మెట్రో నగరాల్లో ఒకటిగా ఉన్న హైదరాబాద్ మహానగరంపై గత పదేండ్లుగా కేంద్రం చిన్నచూపు చూస్తున్నది. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ నిధులు ఇవ్వపోగా, తాజాగా జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలోనూ మెట్రో రైలు విషయంలో తెలంగాణకు మొండి చెయ్యి చూపింది. హైదరాబాద్‌ను విస్మరించి.. దేశంలోని మూడు మెట్రో రైలు ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించింది. మరీ ప్రధాని మోదీ 'నా బడే భాయ్' అని చెప్పుకొనే చోటే భాయ్(సీఎం రేవంత్‌రెడ్డి) ఈ విషయంలో ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం ఏమిటని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నా.. కేంద్రం రాష్ట్ర అభివృద్ధికి సహకరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.*

*-సిటీబ్యూరో, ఆగస్టు 17 (నమస్తేతెలంగాణ)*

ఇటీవల ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు ఇవ్వని కేంద్ర ప్రభుత్వం..శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలోనూ దేశంలోని మూడు మెట్రో రైలు ప్రాజెక్టులకు భారీగా నిధులను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రో నగరాల్లో ఒకటైన హైదరాబాద్‌పై మాత్రం కేంద్రం చిన్న చూపు చూస్తున్నదనడానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం. నగరంలో మెట్రో దశ పనుల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపినా పట్టించుకోలేదు. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి మెట్రో రెండో దశ ప్రాజెక్టుల విషయాన్ని కేంద్రం ముందు ఉంచినా.. గుండు సున్నాయే చూపడం గమనార్హం.

### ఎన్నికలకు ముందు మహారాష్ట్రకు వరాలు..

మహారాష్ట్రలో ప్రస్తుతం బీజేపీ మద్దతుతో కూడిన ప్రభుత్వం అధికారంలో ఉంది. త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్న నేపథ్యంలోనే అక్కడ రెండు మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ నిధులు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో థానే ఇంటిగ్రల్ రింగ్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.12200.00 కోట్లు, పుణె మెట్రో రైలు ప్రాజెక్టు కోసం రూ. 2954.53 కోట్లు కేటాయించింది. వీటికి తోడు తెలంగాణ పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రానికి సంబంధించి బెంగళూరు మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్-3 కోసం రూ.15,611 కోట్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇలా తెలంగాణకు ఇరువైపులా ఉన్న రెండు రాష్ట్రాల్లోని మూడు మెట్రో రైలు ప్రాజెక్టులకు ఒకేసారి మొత్తం రూ.30,765 కోట్లకు ఆమోదం తెలిపింది. కానీ హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులకు మాత్రం కేంద్ర ప్రభుత్వం పదేండ్లుగా మొండిచెయి చూపుతూనే ఉన్నది.

### బీహెచ్ఈఎల్ -లక్డీకాపూల్ ప్రతిపాదనలు..

హైదరాబాద్ నగరంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీహెచ్ఈఎల్–లక్డీకాపూల్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను కేంద్రానికి సమర్పించింది. సుమారు 23 కి.మీ మేర నిర్మించే ఈ మార్గానికి సుమారు రూ.8500 కోట్ల వ్యయం అవుతుందని, దీనికి ఆమోదం తెలిపి నిధులు కేటాయించాలని కోరినా.. నరేంద్ర మోదీ ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి కేంద్రం సహకరించాలని అనేకసార్లు స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారు. అయినా హైదరాబాద్ మెట్రో పేరు ఎత్తలేదు. తెలంగాణ నుంచి 8 మంది పార్లమెంటు సభ్యులు బీజేపీ గెలిచినా.. రాష్ట్ర అభివృద్ధి పట్ల ఏమాత్రం సహకరించడం లేదనే విమర్శలున్నాయి.

### కేంద్ర కేబినెట్‌లో ఆమోదం పొందిన మెట్రో ప్రాజెక్టులు

- థానే ఇంటిగ్రల్ రింగ్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.12200.00 కోట్లు
- పుణె మెట్రో మెట్రో రైలు ప్రాజెక్టు కోసం రూ.2954.53 కోట్లు.
- బెంగళూరు మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్-3 కోసం రూ.15,611 కోట్లు.
- కర్ణాటక, మహారాష్ట్రలోని మెట్రో రైలు ప్రాజెక్టుల కోసం కేంద్ర కేబినెట్ మొత్తం రూ.30,765 కోట్లకు ఆమోదం